బరితెగింపు

- పులివర్తి నాని పై దాడి
- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం
- గన్‌మెన్ ధరణికి తీవ్రగాయం
- ఆత్మరక్షణ కోసం గాల్లోకి కాల్పులు
- స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న నాని
- మహిళ యూనివర్సిటీ ఎదుట తీవ్ర ఉద్రిక్తత, 144 సెక్షన్ అమలు



స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న పులివర్తి నాని



దాడిలో గాయపడిన నాని గన్‌మెన్ ధరణి, పద్మావతి యూనివర్శి వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి - తిరుపతి: చంద్రగిరి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పై వైసీపీ అనుయాయులు తీవ్ర దాడికి పాల్పడిన ఘటన మంగళవారం సాయంత్రం తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఎదుట చోటుచేసుకుంది. స్ట్రాంగ్ రూములను పరిశీలించేందుకు వస్తున్న పులివర్తి నాని కారును అడ్డగించిన దుండగులు మారణాయుధాలతో సమ్మెట (భారీ సుత్తి), కత్తి, రాడ్లు, బీరు బాటిల్లు, క్రికెట్ స్టిక్స్, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. నాని పై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆయన గన్మెన్ ధరణి పైన విచక్షణారహితంగా సమ్మిటితో దాడి చేశారు. దుండగులు విసిరిన రాళ్లు నాని ఛాతికి తగలడంతో ఆయన అస్వస్థకు గురి అయ్యారు. ఆ కారులోనే ఉన్న ఆయన సతీమణి సుధారెడ్డి పైకి వైసిపి అనువాయిలు బీరు బాటలతో దాడికి ప్రయత్నించారు. దీంతో అప్పటికే తీవ్ర రక్తగాయంతో ఉన్న గన్మెన్ ధరణి ఆత్మరక్షణ కోసం ఒక రౌండ్ గాల్లోకి కాల్పులు జరిపారు. అయినప్పటికీ వెనుకాడన్ని దుండగులు 20 నిమిషాల పాటు రాళ్ల వర్షం కురిపించారు. దీంతో నాని ప్రయాణిస్తున్న వాహనంతో పాటు మరో రెండు వాహనాలు ధ్వంసం అయ్యాయి. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పద్మావతి మహిళా యూనివర్సిటీ వద్దకు చేరుకున్నారు. వైసీపీ కార్యకర్తలు సైతం పెద్దఎత్తున చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్, ఎస్పీలు పోలీసు బలగాలను పెద్ద ఎత్తున రంగంలోకి దించారు. పోలీసులు ఇరు వర్గాలను చదరగొట్టి పరిస్థితులను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. గాయపడిన పులివర్తి నాని, ఆయన గన్మెన్ ధరణిలను హుటాహుటిన స్విమ్స్‌కు తరలించి వైద్యచికిత్స అందిస్తున్నారు. పోలీసులకు అందిన ఘటన వీడియోల ఆధారంగా దాడికి పాల్పడింది రామచంద్రాపురం మండలం వైసిపి జడ్పిటిసి భానుప్రకాష్ (భాను)గా గుర్తించారు. ముందస్తు ప్రణాళిక మేరకే తన అనుయాయులతో కలిసి దాడికి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. అయితే ఈ దాడిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చం నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లు తీవ్రంగా ఖండించారు. చంద్రగిరిలో తెలుగుదేశం గెలుస్తుందన్న భయంతోనే కక్షగట్టి నానిపై చెవిరెడ్డి దాడి చేయించారంటూ ఆరోపించారు.

పోలీసుల వైపల్యం..!

పులివర్తి నానిపై జరిగిన దాడి ఘటనలో పోలీసుల వైపలంపై తీవ్ర దుమారం రేగుతొంది. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్లు ఉన్న శ్రీపద్మావతి మహిళ యూనివర్సిటీ వద్దనే మారణాయుధాలతో బాడికి పాల్పడటంపై పోలీసుల తీరు పైనా సందేహాలు వెల్లువెత్తుతున్నాయంటూ కూటమి నేతలతో ఆరోపిస్తున్నారు. కట్టుదిట్టమైన భద్రత, నిఘా ఉన్నాయంటూ చెబుతున్న మహిళ యూనివర్సిటీలోకి మారణాయుధాలు ఎలా వచ్చాయంటూ వామపక్ష నేతల సైతం ప్రశ్నిస్తుండడం గమనార్హం. దీనిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు.

మళ్లీ లాఠీ చార్జీ

శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం, అటు టిడిపి ఇటు వైసిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. దీంతో వారిని చదరగొట్టేందుకు మరోసారి లాఠీ ఛార్జ్ చేశారు. అయితే పోలీసులు ఒక వర్గానికి చెందిన వారినే చదరగొడుతున్నారని మరోవర్గం విమర్శలు గుప్పించింది. ఇదే సందర్భంలో వీటన్నింటినీ కవరేజ్ చేస్తున్న మీడియా ప్రతినిధుల పైన లాఠీలు ఝులిపించడం గమనార్హం.

రామిరెడ్డిపల్లి ఘటనకు ప్రతిగానే వైసిపి దాడినా?

చంద్రగిరి నియోజక వర్గంలోని రామిరెడ్డిపల్లిలో సోమవారం రాత్రి జరిగిన దాడికి ప్రతిగానే టిడిపి అభ్యర్థి నానిపై వైసీపీ అనుయాయులు దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. రామిరెడ్డిపల్లి పోలింగ్ బూత్‌లో ఏర్పడ్డ వివాదం కాస్త పెద్దదై వైసిపి అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కారుపై టిడిపి శ్రేణులు దాడికి పాల్పడే వరకు వచ్చింది. దాదాపు గంటపాటు ఆయనను నిర్బంధించి, వైసీపీ ఏజెంట్‌గా ఉన్న చంద్రశేఖర్ రెడ్డి ఇంటిని కాల్చివేశారు. అయితే జిల్లా కలెక్టర్ చొరవతో తాత్కాలికంగా వివాదం సద్దుమణిగింది. అయితే ఆ దాడికి ప్రతిగానే మంగళవారం సాయంత్రం టిడిపి అభ్యర్థి నానిపై దాడికి పాల్పడినట్లు పోలీసుల సైతం అనుమానిస్తున్నారు.

తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పద్మావతి యూనివర్శిటి పరిధిలో పరిస్థితి అదుపులో ఉందని, 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతోందని, ఎవరూ ఇటువైపు రావొద్దు అని హెచ్చరించారు. మీడియా వ్యక్తులు సైతం ఇటు రావొద్దు అని సూచించారు.

మీడియాపై దాడి దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

చిత్తూరు అర్బన్: తిరుపతి మహిళా యూనివర్సిటీ వద్ద పోలీసులు వ్యవహరించిన తీరు, మీడియా మిత్రులు, సామాన్యులపై విచక్షణారహితంగా దాడి చేయడాన్ని చిత్తూరు జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన దాడికి నిరసనగా జరుగుతున్న ఆందోళనను కవర్ చేస్తున్న మీడియా మిత్రులపై లాఠీఛార్జి చేయడం దుర్మార్గమన్నారు. అదే ప్రాంతంలో సామాన్యులను కూడా పోలీసులు లాఠీఛార్జీ చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

నానిపై దాడి హేయమైన చర్య...

చిత్తూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్

వైసీపీ కుట్ర పూరిత రాజకీయాలకు స్వస్తి పలికే రోజులు సమీపంలోనే ఉన్నాయని, వైసీపీ లాంటి అరాచక శక్తుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు నిన్ననే ప్రజలంతా తమ ఓటుతో ఈ అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు నిర్ణయించారని చిత్తూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. ఓటమి భయంతో చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తన తండ్రి టిడిపి అభ్యర్థి పులివర్తి నానిపై సుత్తి, గొడ్డలి, కొడవళ్ళతో దాడి చేసి హత్యాయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

తిరుపతిలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలి..

సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

తిరుపతి సిటీ: చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైసీపీ గుండాల హత్యాప్రయత్నం దాడిని తీవ్రంగా ఖండిస్తూ తిరుపతిలో ప్రజాస్వామ్యాన్ని ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంగణంలోని ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద వైసీపీ గుండాలు నానిపై జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, తిరుపతి నగరంలో ఇలాంటి ఘటనలు జరగడం అత్యంత బాధాకరమని అన్నారు.

నానిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

శ్రీకాళహస్తి: తిరుపతి మహిళా విశ్వవిద్యాలయం వద్ద స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలనకు వెళ్లిన చంద్రగిరి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై వైసీపీ అల్లరి మూకలు కత్తులు, రాడ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఓడిపోతాం అనే భయంతోనే వైసీపీ నేతలు ఇలాంటి చర్యలకు తెగబడుతున్నారనీ, దీన్ని ప్రజాస్వామ్య వాదులందరూ తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. ఎలక్షన్ కమిషన్ నానిపై దాడిని తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పులివర్తి నాని పై దాడికి సిపిఎం ఖండన

తిరుపతి టౌన్: చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిపై శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కువ సంఖ్యలో ఇతరులను సంఘ వ్యతిరేక శక్తులను అనుమతించడం గొడవలు జరగడానికి అవకాశం కల్పించినట్లు అయిందని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పులివర్తి నానిపై వైసీపీ అల్లరి మూకలు చేసిన దాడి అమానుషం అని జాతీయ చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు చిన్నరెడ్డిబాబు ఒక ప్రకటనలో ఖండించారు.

తాతయ్యగుంట

గంగమ్మ జాతర ప్రారంభం



తాతయ్యగుంట గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు సందర్భంగా తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతర వారం రోజులు వాయిదాతో జరుగుతుంది. ఈనెల ఏడో తేదీ చాటింపుతో గంగమ్మ జాతర ప్రారంభం కావల్సి ఉండగా ఎన్నికల వల్ల జాతరకు బందోబస్తు కల్పించలేమని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తిరుపతి అర్బన్ ఎస్పి చెప్పడంతో వారం రోజులు ఆలస్యంగా జాతర మొదలైంది. ఎంతో వైభవంగా జరిగే తాతయ్యగుంట గంగమ్మ జాతరకు చాటింపు 14వ తేదీ మంగళవారం జరిగింది. ఏపీలో జరిగే జాతరలో గంగమ్మ జాతర ఒకటి. ఏడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. తిరుపతి గ్రామదేవత తాతాయ్యగుంట గంగమ్మకు ప్రతిఏటా జాతర చేయడం ఆనవాయితీగా వస్తోంది. జాతరలో భాగంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేస్తారు. మంగళవారం అర్ధరాత్రి చాటింపుతో గంగమ్మ జాతర ప్రారంభంకానుంది. కైకాల వంశస్తులు తిరుపతి గంగజాతర సందర్భంగా మంగళవారం గ్రామంలో చాటింపు వేస్తారు. అనంతరం భేరి వీధిలో తొలి చాటింపు పూజ నిర్వహించి నగర శివారు ప్రాంతాలలో అష్టదిగ్బంధనం చేసి చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టనున్నారు. బుధవారం బైరాగి వేషంతో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. నేటి నుంచి ఈనెల 21వ తేదీ వరకు జాతర జరుగనుంది. 22వ తేదీన తెల్లవారు జామున అమ్మవారి విశ్వరూప దర్శనం, చెంప నరికే కార్యక్రమంతో జాతర ముగియనుంది. ఈ ఏడు రోజుల పాటు వివిధ వేషాలలో గంగమ్మను భక్తులు దర్శించుకోనున్నారు. అలాగే ఈ జాతరలో మరో విశేషం ఉంది.. జాతర జరిగినన్ని రోజులు గ్రామస్తులు ఊరి విడిచి వెళ్లరాదు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా రాత్రుళ్లు బస చేయకుండా వెళ్లిపోవడం అక్కడి ఆచారం.

చాటింపుతో జాతర ప్రారంభం..

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం అర్ధరాత్రి చాటింపుతో జాతర మొదలవుతుంది. బుధవారం బైరాగి వేషం గురువారం బండవేశం, శుక్రవారం తోటి వేషం, శనివారం దొరవేశం, ఆదివారం మాతంగి వేషం, సోమవారం సున్నపు కుండలు, మంగళవారం గంగమ్మ జాతర, బుధవారం విశ్వరూప దర్శనంతో జాతర ముగుస్తుంది.

గంగమ్మను దర్శించుకున్న పలువురు నేతలు..

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పాల్గొంటే ఎన్నికలు ముగియడంతో మంగళవారం తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు, తిరుపతి టిడిపి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టిడిపి కార్పొరేటర్ అన్నా యాదవ్‌తో పాటు పలువురు టిడిపి జనసేన నాయకులు దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



గంగమ్మ తల్లి నామావళి సీడీ ఆవిష్కరించిన టీటీడీ చైర్మన్ భూమన

పోల్డ్ ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సార్వత్రిక ఎన్నికలు 2024 అనంతరం 25 చిత్తూరు (ఎస్‌సి) పార్లమెంటు నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంలను జిల్లాస్థాయి కౌంటింగ్ కేంద్రంగా ఉన్న పూతలపట్టు మండలం ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూములలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ సీలింగ్ చేసే ప్రక్రియను మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం సాధారణ పరిశీలకులు సాదిక్ ఆలం, నగరి, జీడి నెల్లూరు అసెంబ్లీ సెగ్మెంట్ల సాధారణ పరిశీలకులు కైలాష్ వాంఖడే, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షణ్మోహన్ నిర్వహించారు. 25 చిత్తూరు (ఎస్‌సి) పార్లమెంట్, 165-పుంగనూరు, 170- నగరి, 171 -జీడి నెల్లూరు, 172- చిత్తూరు, 173-పూతలపట్టు 174-పలమనేరు, 175- కుప్పం నియోజకవర్గాలకు సంబంధించి పోల్డ్ అయిన ఈవిఎంలు స్ట్రాంగ్ రూములకు చేరుకొనే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్, 172-చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి. శ్రీనివాసులు, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డిఆర్‌ఓ బి.పుల్లయ్య, పుంగనూరు, నగరి, జీడి నెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం ఆర్‌ఓలు, మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకట శివ, చిన్నయ్య, మనోజ్ రెడ్డి, శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి ప్రసన్న, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ పోల్డ్ ఈవిఎంలు

కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జిల్లాలోని 23-తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోల్ అయిన ఈవిఎంలను, సంబంధిత సామగ్రిని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్ రూం నందు సార్వత్రిక ఎన్నికల సాధారణ పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు భద్ర పరచడం జరిగిందని కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈవీఎంలను రాజకీయ పార్టీల, అభ్యర్థులు, అబ్జర్వర్‌ల సమక్షంలో స్ట్రాంగ్ రూంలో భద్రపరచినట్లు తెలిపారు. శ్రీ పద్మావతి మహిళ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ నందు సాధారణ పరిశీలకులు ఉజ్వల్ కుమార్ ఘోష్, కైలాస్ వాంఖడే, కే.జ్యోతి, జిల్లా సాధారణ ఎన్నికల పోలీసు పరిశీలకులు అరవింద్ సాల్వే, రిటర్నింగ్ అధికారుల, రాజకీయ పార్టీల, అభ్యర్థుల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేసి స్ట్రాంగ్ రూంలకు తాళాలు వేయడం జరిగిందనీ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, పోలీస్ భద్రత సిబ్బంది తదితరులు ఉన్నారు.

పిహెచ్‌సీలో తనిఖీలు



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ.ప్రభావతి దేవి మంగళవారం కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, ఆరోగ్యశ్రీ, పిహెచ్‌సిలో డెలివరీ అయిన ప్రతి కేసుకి ఆరోగ్య ఆసరా ఇవ్వాలని, ఇప్పటివరకు ఎన్ని అప్డేట్ చేశారనే విషయంపై వివిధ నేషనల్ కార్యక్రమాల రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. కామినాయనిపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అడల్ట్ బిసిజి వాక్సినేషన్ సెక్షన్ సైట్స్ పూర్తి చేయాలన్నారు. అత్యవసర సమయాలలో కాల్‌ఇన్ డాక్టర్‌ని పిలిపించుకోవాలన్నారు. పిహెచ్‌సి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రతిఒక్కరు టైమింగ్ మెయిన్టైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుదర్శన్, డాక్టర్ రాజేశ్వరి, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

పోలింగ్ నిర్వహణకు సహకరించిన అందరికీ కతజ్ఞతలు

జిల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విజయవంతంగా పోలింగ్ నిర్వహణకు సహకరించిన ఎన్నికల కమీషన్ అబ్జర్వర్లకు, జిల్లా రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది, అన్నిశాఖల అధికారులు, జిల్లా అధికారులు, నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడిఓలు ప్రిసైడింగ్ అధికారులు, ఏపీఓలు, ఓపిఓలు, పోలీస్ అధికారులు, కేంద్ర బలగాలు, అన్ని రకాల నిఘా స్క్వాడ్లు, సెక్టోరల్, రూట్ అధికారులు, ఎన్‌ఎస్‌ఎస్, మాజీ సైనికులు, ఎన్సిసి, జిల్లాస్థాయి నుంచి గ్రామ వరకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఇతర ఎన్నికల అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. షన్మోహన్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు సహకరించిన అన్ని వర్గాల జిల్లా ప్రజలు, ఓటర్లు, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, రాజకీయ పార్టీలు, సంస్థలు, మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో ఈవీఏంలను ఆయా స్ట్రాంగ్ రూమ్‌లలో ఈసిఐ నిబంధనల మేరకు భద్రపరచే కార్యక్రమం మంగళవారం కొనసాగుతుందని పేర్కొన్నారు.



అనుమానంతో భార్యను నరికిన భర్త



చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్వాతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యనే విచక్షణారహితంగా కత్తితో నరికి గాయపడిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా యాదమరి మండలం బెంగళూరు- చెన్నై జాతీయ రహదారి ముత్తరపల్లి బస్టాప్ వద్ద 14వ తేదీ మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో జేసిబి మెకానిక్‌గా పనిచేస్తున్న చీలాపల్లికి చెందిన ఉమాపతి (35) తన భార్య స్వాతి (29)పై కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి నరికి అక్కడి నుంచి పరారయ్యాడు. కొన ఊపిరితో ఉన్న స్వాతిని స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరు చిత్తూరు జానకారపల్లిలో కాపురం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. యాదమరి ఎస్సై రామాంజనేయులు కేసు నమోదు చేసి నిందితుడు ఉమాపతిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పెళ్లకూరులో ఆటవికం

- ఓటెయ్యలేదని గిరిజన మహిళపై దాడి
- నిండు గర్భిణీ అని కూడా చూడని వైసిపీ మూకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్వాతంత్రం సిద్ధించి 77ఏళ్లు గడిచిపోతున్నా సమాజంలో ఇంకా ఆటవిక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. తమ పార్టీకి ఓటు వెయ్యలేదని కారణంతో ఓ గిరిజన మహిళపై వైసీపీ మూకలు దాడి చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెళ్లకూరుమిట్టలో చోటు చేసుకుంది. ఆ గిరిజన మహిళ నిండు గర్భిణీ అన్న సంగతిని కూడా పక్కన పెట్టి వైసీపీ మూకలు దాడి చేయడం సిగ్గుచేటు. గ్రామస్తుల కథనం మేరకు.. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ పోలింగ్లో పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. పెళ్ళకూరు మిట్టకు చెందిన అరుణ అనే గిరిజన మహిళ కూడా ఓటింగ్ లో పాల్గొంది. అయితే తాము చెప్పిన వారికి కాకుండా టీడీపీ కి ఓటు ఎలా వేస్తావంటూ ఆ గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి దాడి చేశారు. గర్భిణీ అని కూడా చూడకుండా దాడికి పాల్పడ్డారు. దీంతో బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడ్డ వారిలో ఓ వాలంటీర్ తో పాటు ఆ మండలలో సహకార బ్యాంకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఓ కీలక నేత అనుచరులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈదాడిపై పెళ్లకూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు అందగా, విచారణ చేస్తున్నారు.



ఎవరి ధీమా వారిదే !

ప్రజాశక్తి- తిరుపతి

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఓట్ల పండుగ ముగిసింది. ఇక ప్రజాతీర్పే మిగులుంది. మరో మూడు వారాలు తీర్పు కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి అవిశ్రాంతంగా పనిచేసిన రాజకీయ పార్టీల నేతలు, అధికారులు కాస్త ఊపిరి పీల్చుకుంటున్నారు. పోలింగ్ ముగియడంతో ఓటింగ్ సరళిపై లెక్కల్లో మునిగి తేలారు. పోలింగ్ బూత్‌ల వారీగా పోలైన ఓట్లు, అనుకూల, ప్రతికూల ఓట్లపైనా ఆరా తీస్తున్నారు. కూడికలు, తీసివేతలతో ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నువ్వా, నేనా అన్నట్లు సాగిన అధికార వైసిపి, ఎన్‌డిఎ, ఇండియా కూటముల పోరులో విజయం ఎవదరిదనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఇక ఎన్నడూ లేనంతగా తిరుపతి జిల్లా మొత్తంలో 78.63 శాతం ఓటింగ్ పోలింగ్ కావడం, గూడూరులో 78.89 శాతం, సూళ్లూరు పేటలో 82.92, వెంకటగిరిలో 80.87 శాతం, చంద్రగిరిలో 79.89, తిరుపతిలో 63.32 శాతం, శ్రీకాళహస్తిలో 83.25, సత్యవేడులో 85.28 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే తిరుపతి పార్లమెంటు పరిధిలో 79.10 శాతం ఓటింగ్ నమోదు చేయడంతో ఓటింగ్ సరళి తమకంటే తమకే అనుకూలంగా ఉన్నాయంటూ అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. పోటాపోటీగా జరిగిన ఈ ఎన్నికల్లో చంద్రగిరి, రేణిగుంట, సూళ్లురుపేటలో చెదురుమదరు ఘటనలు మినహా తిరుపతి జిల్లా అంతటా ప్రశాంతంగా జరిగింది. కొన్నిప్రాంతాల్లో రాత్రి 11 గంటల వరకు నిరీక్షించి మరీ ఓటర్లు ఓటేశారు. అసెంబ్లీకి 133 మంది, 23మంది పార్లమెంటుకు పోటీచేశారు. తిరుపతిలో అత్యధికంగా 46 మంది, సూళ్లురుపేటలో 9 మంది అభ్యర్థులు పోటీచేశారు. అయితే ప్రధానంగా అధికార వైసిపికి, అటు ఎన్‌డిఎ, ఇటు ఇండియాకూటమి అభ్యర్థులు మాత్రమే పోటీ ఇవ్వగలిగారు. గతంలో పోల్చితే ఈ దఫా 6 నుంచి 7 శాతం పెరిగిన ఓట్లు తమకే అనుకూలిస్తాయని ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. తాము అందించిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని అధికార పార్టీ నేతలు చెబుతుండగా, వైసిపి ప్రభుత్వ అవినీతి, దౌరన్యం సహించలేక ఓటర్లు తమవైపే మొగ్గుచూపారంటూ ఇండియా, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులు ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో ఎన్‌డిఎ కూటమి తరపున బిజెపి పార్లమెంటు అభ్యర్థి వరప్రసాద్, జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కూటమి నేతలతో కలిసి ఓ ప్రైవేటు హోటల్లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ విజయం తమదేనని ప్రకటించారు. తిరుపతిలో పెరిగిన ఓటింగ్ శాతం తమదేనని, ఖచ్చితంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి దొంగ ఓట్లను అడ్డుకోవడంతోనే తమ విజయం సునాయాసమైందని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, బిజెపి నాయకులు భానుప్రకాష్‌రెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. ఇక టిటిడి ఛైర్మన్, వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి అభినయ్‌రెడ్డిలు తమ ఇంటి వద్దనే ముఖ్యనాయకులతో సమాలోచనలు జరిపారు. విజయం తమదేనని ధీమాగా ఉన్నారు. తిరుపతి గంగమ్మ జాతర పాటల సిడి ఆవిష్కరణ సందర్భంగానూ విజయం తమదేనని ప్రకటించారు. ఇండియా కూటమి నుంచి సిపిఐ అసెంబ్లీ పి.మురళి, కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి చింతామోహన్‌లూ పోలింగ్ సరళిని అంచనా వేసి విజయం సాధిస్తామని చెబుతున్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని 7 అసంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఈవిఎంలు, సంబంధిత సామాగ్రిని తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలలో మంగళవారం భద్రపరిచారు. పార్లమెంటు జనరల్ పరిశీలకులు ఉజ్వల్ కుమార్ ఘోష్, కైలాస్‌వాంఖడే, జ్యోతి, జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేసి భద్రపరిచారు.



న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

మధ్యవర్తిత్వ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : న్యాయవాదులు మధ్య వర్తిత్వ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్‌సి రాఘవేంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర ఆధ్వర్యంలో పుత్తూరు న్యాయవాదులు మధ్య వర్తిత్వ చట్టంపై కోర్టులో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్య వర్తిత్వ వ్యాజ్యాలు ఎక్కువ సంతృప్తికరమైన ఫలితాలను ఇస్తుందని మధ్య వర్తిత్వం ద్వారా పరిష్కారమైన వ్యాజ్యాలలో కోర్టు ఫీజులు వాపస్ చేస్తారని పేర్కొన్నారు. ఈ చట్టం ఆందోళన తగ్గించి మనశ్శాంతిని ఇస్తుందని వైరి గ్రూపుల మధ్య వ్యక్తిగత సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు తోడ్పడుతుందన్నారు. జూన్ 29వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయవాదులను కోరారు. జూనియర్ సివిల్ జడ్జి జానకి మాట్లాడుతూ మధ్యవర్తిత్వ చట్టం గురించి అందరూ తెలుసుకుని వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి మురళి రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన 9వ వార్డు టిడిపి యూనిట్ ప్రసిడెంట్ రామ్మూర్తిని ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మంగళవారం పరామర్శించారు. ఇటీవల బైక్ ఢీకొన్న ఘటనలో రామ్మూర్తి కాలుకు గాయమై స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో చికిత్స పొందుతున్నారు. కాలు గాయం తగ్గకపోయినా పోలింగ్‌లో ఓటు హక్కును రామ్మూర్తి వినియోగించుకోవడాన్ని ఆరణి శ్రీనివాసులు అభినందించారు. రామ్మూర్తి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆరణి జగన్, ఆళ్వార్ మురళీ పాల్గొన్నారు.

ఘనంగా చిల్లీస్ 15వ వార్షికోత్సవ సంబరాలు

- రూ.15కి చికెన్ బిర్యాని - నగర ప్రజలకు పంపిణీ చేసిన చిల్లీస్ అంజి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: చిల్లీస్ 15వ వార్షికోత్సవ సంబ రాలు అంగరంగ వైభవంగా మంగళవారం జరిగాయి. అన్నమయ్య సర్కిల్ ఎయిర్ బైపాస్ రోడ్ లోని మెయిన్ బ్రాంచ్ లో మొదటిగా కేక్ కట్ చేసి చిల్లీస్ అండ్ రెస్టారెంట్, హోటల్స్ అధినేత హోటల్స్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ నగర అధ్యక్షులు చిల్లీస్ అంజి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిల్లీస్ అంజి చేతుల మీదగా 15వ వార్షికోత్సవ సందర్భాన్ని పరిష్కరించుకొని నగర ప్రజలకు ?15లకే ఒక చికెన్ బిర్యానీ అందజేశారు. దాదాపు 500 మంది ప్రజలు యువత ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు చిల్లీస్ అంజి తెలిపారు. ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చిల్లీ స్ రెస్టారెంట్ స్ అండ్ చలటల్స్ ద్వారానే కాకుండా అసోసియేషన్ తరపున కూడా నిరంతరం సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిల్లీస్ హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ సభ్యులు, అంజి శ్రేయోభిలాషులు మిత్రులు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రూ.15కే చికెన్ బిర్యాని విక్రయిస్తున్న అంజి అల్లీస్

జేడి రాజశేఖర్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - సత్యవేడు: ఎండని సైతం లెక్కచేయకుండా పోలింగ్ ముగిసే వరకు నిలబడి ఓటు వేసిన సత్యవేడు నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, అవ్వ తాతలకు, నా అన్న తమ్ములకు, అక్క చెల్లెమ్మలకు, యువతకు నియోజకవర్గ ప్రజలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సత్యవేడు నియోజకవర్గ అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థి జేడి రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేరుకుపోయిన మురుగునీరు

- అధికమవుతున్న దోమలు - ప్రజలకు అంటు వ్యాధుల భయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డ్రైనేజీలో మురుగునీరు బాగా పేరుకు పోయింది. ఈ కారణంగానే దోమలు విపరీతం గా వ్యాపిస్తున్నాయి. అంటు వ్యాధు లు వ్యాపిస్తాయనే భయంతో స్థానికులు భయాందోళనకు గురవు తున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారులు దీన్ని చూసీ చూడనట్లు వ్యవహరి స్తుండడంతో స్థానికులు ఆందోళన చెందు తున్నారు.

స్థానిక పురపాలక సంఘం పరిధిలోని పిల్లారిపట్టు రోడ్డులో డ్రైనేజీలో చెత్త, మురికి నీరు నిండి పోవడంతో కంపు కొడుతోంది. దోమలు అధికంగా పెరగడంతో ఆ రోడ్డుపైనే పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు వెళు తుంటారు. పక్కనే చుట్టుపక్కన గ్రామాలు వారు కూడా ఆ రోడ్డుపైనే వెళుతుంటారు. రహదారిపై వెళ్లాలంటే ముక్కులు మూసుకొని వెళ్లే పరిస్థితి వస్తోందని, దుర్వాసన పీల్చలేక సతమతమవుతున్నారు. అంతే కాకుండా వాటిలో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలకు అంటు వ్యాధులు చికెన్ గున్యా, టైఫాయిడ్, మలేరియా, బోదకాలు వంటివి వస్తాయని భయాందోళనకు గురవుతున్నారు. చాలామంది ఆస్పత్రి పాలవుతున్నారని పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. గట్టిగా నిలదీస్తే నిధులు లేదని, ప్రభుత్వం నుంచి మంజూరైన తర్వాత డ్రైనేజీ నిర్మాణం పూర్తిచేస్తామని అధికారులు కుంటు సాకులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీల కట్టడానికి తగు ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో వార్డు ప్రజలు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని చెబుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన మురుగునీరు

ఆర్‌టిసి అధికారుల నిర్లక్ష్యం

- కూలిన ప్రహరీ గోడలకు పునర్నిర్మాణాలు ఏవి - కూలిన ప్రదేశంలో ముళ్ల చెట్లతో కప్పివేత
- కోట్ల రూపాయల విడి భాగాలకు భద్రత ఏదీ?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా రవాణా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యానికి కోట్ల రూపాయలు విలువచేసే విడి భాగాలకు రక్షణ కరువైంది. మంగళం పరిధిలోని మంగళం ఆర్‌టిసి డిపో ప్రహరీ గోడలు రెండు వైపులా కూలి నెలలు గడుస్తున్నా అధికారులు మౌనంగా వ్యవహరించడం వారి ఉదాసీనతకు నిలువుటద్దం పడుతోంది. డిపోకు రెండు వైపులా రెండు గోడలు నెలల వ్యవధిలో 100 అడుగుల మేర కూలిపోయినా ఇప్పటివరకు దాని మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

తిరుపతి–కరకంబాడి మార్గంలోని మంగళం ఆర్‌టిసి డిపోను 9 ఏళ్ల క్రితం భారీ ప్రహరీ గోడను నిర్మించారు. గత ఏడాది ఆగస్టులో కురిసిన వర్షాలకు 27వ తేదీ తెల్లవారు జామున డిపోకు దక్షిణం వైపు ఉన్న ప్రహరీ గోడ డిపోలో చేరిన నీటి తీవ్రతకు తట్టుకోలేక వంద అడుగులకు పైగా కుప్పకూలింది. ఆనాడు అధికారులు వెంటనే పటిష్టమైన చర్యలు చేపడతామని మీడియాకు తెలిపారు. తరువాత యధావిధిగా వారి నిస్సహాయతను ప్రదర్శిస్తూ పట్టలు కట్టి కాలం వెళ్లదీస్తున్నారు. తర్వాత నవంబర్ 28వ తేదీ రాత్రి కురిసిన వర్షానికి ఉదయం 5 గంటల ప్రాంతంలో డిపోకు తూర్పు వైపుగా ఉన్న ప్రహరీ గోడ వంద అడుగుల మేర కూలిపోయింది. కూలిపోయిన సమయంలో డిపోలో బస్సులకు అమర్చే రిమ్ములు, టైర్లు, ఇతర సామగ్రి కొట్టుకుని ప్రధాన మార్గానికి చేరింది. పటిష్టమైన గోడను నిర్మించాల్సిన అధికారులు నాణ్యతలేని ప్రహరీ గోడలను నిర్మించడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికంగా పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు 'అదిగో ఇంజనీరింగ్ విభాగానికి లేఖ రాశాం... వారు వచ్చి అంచనాలు వేసుకుని త్వరలో కూలిన ప్రహరీ గోడ ప్రదేశంలో నూతన గోడల నిర్మాణం చేపడతారు..' అని డిపో మేనేజర్ తెలిపారు. అయినా నేటి వరకు ఆర్టీసీ అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోకుండా కోట్ల విలువైన బస్సుల మరమ్మతులకు ఉపయోగించే విడిభాగాల రక్షణ గాలికి వదిలేశారు. ప్రస్తుతం దక్షిణం వైపున కూలిన ప్రహరీ గోడకు పట్టలు, తూర్పు వైపున కూలిన ప్రహరీ గోడకు ముళ్ల కంపను ఆర్టీసీ అధికారులు అడ్డుపెట్టి నామమాత్ర భద్రత కల్పించారు. తమ సొంత డిపో రక్షణకు చర్యలు తీసుకోకపోవడంపై పలువురు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఆర్‌టిసి ఉన్నతాధికారులు స్పందించి మంగళం డిపో ప్రహరీ గోడలను పునర్నిర్మించాల్సి ఉంది.



గత ఏడాది కూలిన ప్రహరీ గోడ (ఫైల్ ఫోటో)

సిబిఎస్ఇ ఫలితాల్లో 'శ్రీసిటీ' విజయకేతనం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: సిబిఎస్ఇ పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీలోని చిన్మయా, అకార్డ్ విద్యా సంస్థలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. చిన్మయా విద్యాలయ నుంచి పది పరీక్షలలో ఉతీర్ణత సాధించిన 46 మంది విద్యార్థులలో 14 మంది డిస్టింక్షన్ పొందారు. వీరిలో టి సరూప్య ప్రవాహ (90.2 శాతం), ఎన్.రశ్మి గౌడ్ (87.4 శాతం), ఆదిత్య ఝా (86.2 శాతం) మార్కులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. పన్నెండవ తరగతి పరీక్షలలో 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, ఐదుగురు డిస్టింక్షన్, మిగిలిన వారు ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించారు. వీరిలో వంశిక కుమార్, సూర్య ప్రతాప్ నాయక్, లోగిత్ ప్రియ వరుసగా 98 శాతం, 92 శాతం, 86 శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారు. చిన్మయా విద్యాలయకు సంబంధించి వరుసగా 8వ సారి పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉతీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె భువనేశ్వరి తెలిపారు. పన్నెండు తరగతి పరీక్షలలో ఇది మొదటి బ్యాచ్ కాగా, ఇందులోనూ 100 శాతం ఫలితాలతో అద్భుతమైన ప్రారంభం పాఠశాలకు దక్కిందన్నారు. పదవ తరగతి మొదటి బ్యాచ్‌తో పరీక్షలకు హాజరైన అకార్డ్ స్కూల్ 100 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటింది. కుషాగ్రా బన్సల్ 96.2 శాతం, జంపనా నేహా వర్మ 94.4 శాతం, వంకా సుహృత్ 82.2 శాతం మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపాల్ ప్రకటించారు. అకార్డ్‌కు చెందిన వివిధ శాఖల పాఠశాలల్లో శ్రీసిటీ పాఠశాల విద్యార్థి కుషాగ్రా బన్సల్ 96.2 శాతం మార్కులతో అగ్రస్థానం సాధించినట్లు ఈమె తెలిపారు. మంచి ఫలితాలు సాదించినందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- దళిత నాయకుల నిరసన

ప్రజాశక్తి- వెంకటగిరి: తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గ కేంద్రంలో క్రాస్ రోడ్ వద్ద ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రెండు రోజుల క్రితం ధ్వంస చేసిన అగ్రర్ణాల వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని దళిత , గిరిజన బహుజన ప్రజాసంఘాలతో క్రాస్ రోడ్ సెంటర్‌లో మంగళవారం నిరసన వ్యక్తం చేసి రాస్తారోకో, మానవహారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా దళిత, గిరిజన బహుజన, ప్రజా సంఘాల నాయకులు మాట్లా డుతూ బి ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని విగ్రహం పునర్నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నియోజవర్గ స్థాయిలో వేలాది మందితో ఆందోళన చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత, గిరిజన, బహుజన, ప్రజా సంఘాల నాయకులు డి రామకృష్ణ, గోపాల్, గద్దల మునెయ్య, పి ధనంజయ్, వడ్డిపల్లి చెంగయ్య, మంగళపురి సురేష్, కంటి పల్లి రవి, కే సహదేవయ్య, జై చంద్ర, వెంకటేశ్వర్లు, చెంచు కృష్ణయ్య, వెంకటాద్రి, జాన్, నరసింహులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను చిత్తూరు హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సరళమ్మ, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరళమ్మ మాట్లాడుతూ గతంలో హాస్పిటల్లో ఐపీలు సంఖ్య తగ్గాయని ఎందుకంటే గైనకాలజిస్ట్ సెలవుల్లో వెళ్లడం వల్ల కొంత వరకు తగ్గింది. సెలవులో వెళ్లిన వారి స్థానంలో ఒక్క సెంట్రల్ నుంచి డి సిహెచ్ఓ పంపారని అయినా పూర్తి న్యాయం జరగలేదని కొంత వరకు జరిగాయని, సెలవుల్లోకి వెళ్లిన డాక్టర్ వచ్చే నెల వస్తారని అప్పటినుంచి పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. మందులు అల్ట్రా స్కాన్ వంటివి బాగా ఉన్నాయన్నారు. సెమీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేశారని, దానివల్ల ప్రయోజనం ఎవరికైనా గుండెపోటు వచ్చిన వెంటనే హాస్పిటల్లో అడ్మిట్ అయితే ఈసీజీ తీయడం, వారికి ఇంజక్షన్ కొంత మెరుగు పడుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 10 కేసులకు వైద్యం చేశామన్నారు. మంచి ప్రాజెక్టును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో గుండె పోటుతో బాధపడి చనిపోయే వారు ఇలాంటివి చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చాలా మంది యువకులకే గుండెపోటు వస్తోందని కారణం వారు పొగ, మద్యం, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిస కావడం వల్లే అన్నారు. అలాంటి ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలంటే మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని సూచించారు. పుత్తూరు సెంటర్ తనకెంతో ఇష్టమని, ఇక్కడికి వచ్చినందుకు ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణ కాంత్, డాక్టర్ అశోక్ వర్ధన్ కుమార్, ప్రసాద్, పి ధనుష్, అన్నా దొరై, హెడ్ నర్స్ పి దిల్షాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న చిత్తూరు హెల్త్ జాయింట్ కమిషనర్ సరళమ్మ

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో 'విశ్వం' సంచలన విజయం

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర స్థాయిలో 2024 విద్యా సంవత్సరంలో ఏపీఆర్‌జేసీ (ఆంధ్ర ప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్)ప్రవేశానికి ఏప్రిల్ 25వ తేదీ నిర్వహించిన ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యా సంస్థలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులతో పాటు వివిధ విభాగాల్లో 10 లోపు 9 ర్యాంకులు సొంతం చేసుకుని విశ్వం విద్యా సంస్థలకు తిరుగులేదని నిరూపించారు. పి హేమ శ్రీ(హాట్ టికెట్ నెం: 2461910005), కే.నిత్యశ్రీకల్యాణి (హాట్ టికెట్ నెం: 2451910004) రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు సాధించారు. ఓ.ధీరజ్ (హాట్ టికెట్ నెం: 2461910003) రాష్ట్ర స్థాయి ద్వితీయ ర్యాంకులు, పి మేఘన(హాట్ టికెట్ నెం: 24619100004), ఆర్ మహిత (హాట్ టికెట్ నెం: 2451910007) రాష్ట్ర స్థాయి తృతీయ ర్యాంకులు సాధించారు. కే.చరిత(హాట్ టికెట్ నెం: 2461910001) రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, ఆర్.రెడ్డి చరణ్ రెడ్డి(హాట్ టికెట్ నెం: 2451910008) రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, సీ.లేఖన(హాట్ టికెట్ నెం: 2451910002) రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, డీ.నవదీప్ నాయక్ (హాట్ టికెట్ నెం: 2451910003) రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకులు సాధించి ప్రభంజనం సృష్టించారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టరు యన్.విశ్వ నాథ్ రెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్ష ఏదైనా విశ్వం విద్యార్థులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం ఆనవాయితీగా మారిందన్నారు. గత 34 సంవత్సరా లుగా సంచలన ఫలితాలు సాధించి రికార్డులు తిరిగి రాయడం తమ విద్యార్థుల ఫలితాలతో సాధ్యమవు తుందని ధీమా వ్యక్తం చేశారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ విద్యే ప్రథమ ధ్యేయంగా బోధిస్తున్న అధ్యాపక బృందానికి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు సంస్థ అధినేత కృతజ్ఞతలు తెలిపారు. స్ఫూర్తిదాయకమైన విద్యను అందిస్తూ విజయ సాధనకు తోడ్పడటం విశ్వం విద్యా సంస్థలకే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ యన్ విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.




విద్యార్థులను అభినందిస్తున్న విశ్వం విద్యా సంస్థల అధినేత ఎన్ విశ్వనాథరెడ్డి

శ్రీపద్మావతి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళ వారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన, శుద్ధి నిర్వహించారు. ఉదయం 6 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేసిన అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వ దర్శనానికి అనుమతించారు. శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మే 22 నుండి 24వ తేదీ వరకు వార్షిక వసంతోత్సవాలు నిర్వహిస్తారు. ఇందు కోసం ఈ నెల 21వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ నిర్వహిస్తారు. భక్తులు ఒక్కొక్కరు రూ.150 చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. ఉత్సవాల్లో భాగంగా మే 23వ తేదీ ఉదయం 7.45 గంటలకు స్వర్ణ రథోత్సవం కన్నుల పండువగా నిర్వహిస్తారు. వసంతోత్సవాలు జరిగే మూడు రోజులు మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శుక్రవారపు తోటలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో అమ్మవారు విహరిస్తారు. ఈ ఉత్సవాల కారణంగా మే 21 నుండి 24వ తేదీ వరకు కల్యాణో త్సవం, సహస్రదీపాలంకారసేవ, మే 23న తిరుప్పావడ సేవ, మే 24న లక్ష్మి పూజ ఆర్జితసేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ పాల్గొన్నారు.

అమర రాజా విద్యాలయం ప్రభంజనం



ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలోని అమర రాజా విద్యాలయం విద్యార్థులు సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి విజయదుందుభి మోగించారు. సోమవారం ప్రకటించిన ఫలితాలలో విధనుష్ 479 మార్కులతో మొదటి స్థానంలో నిలువగా హర్షిత రెడ్డి 473 మార్కులతో రెండవ స్థానం, జస్వంత్ 471 మూడవ స్థానం ,ఎం. చాతుర్య 469 మార్కులతో నాలుగో స్థానంలో ఉండగా ఈసీ ప్రసూనాచౌదరి 465 మార్కులతో ఐదవ స్థానంలో నిలిచింది. మంచి మార్కులు సాధించిన విద్యార్థినివిద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ దేవ ప్రియ , ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులకి అమరరాజ వ్యవ స్థాపక ఛైర్మన్ రాజన్న ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు అభినం దించారు.

నైతిక విలువలపై శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని సాయినగర్ కళామందిర్‌లో బుధవారం నుంచి తెలుగు సాంస్కృతిక సాహిత్య సమితి ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆ సమితి అధ్యక్షులు తులసినాథ నాయుడు తెలిపారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు 9గంటల నుండి 11గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు నైతిక విలువలను అలవర్చుకోవడం కోసం పద్యము, మాట, ఆట ద్వారా తరగతులు చెప్పడం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి

జగన్‌పై ఓటర్లు కసి చూపారు: మాజీ మంత్రి

ప్రజాశక్తి-పలమనేరు: వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌పై ఉన్న కసిని ప్రజలు ఓట్ల రూపంలో చూపించారని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పలమనేరు టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని అత్యధిక శాతం మంది ఓటు వేసినట్లు అర్థమవుతోందని పేర్కొన్నారు. అర్బన్ ఏరియాల్లో గతంలో 50 నుంచి 60శాతం పోల్ అయ్యేదన్నారు. అలాంటిది ఈ సారి 80నుంచి 90శాతం పోలింగ్ జరగడం విశేషం అన్నారు. పోలింగ్ సరళిని చూస్తే వైసీపీ ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తోందని స్పష్టం చేశారు. ఓటు వినియోగించుకున్న వారందరికీ ఆయన కృతఘ్నతలు తెలిపారు. మీడియా సమావేశంలో నాయకులు ఆర్.వి.బాలాజీ, గిరిబాబు, ఖాజా పీర్, శ్రీధర్, శ్రీనివాసులు, రహీం, చెన్నరాయప్ప, పురుషోత్తం, మహేష్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల మధ్య ఘర్షణ

ఇరు గ్రూపులపై కేసు నమోదు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలో సోమవారం రాత్రి వైసీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు గ్రూపులపై కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం సీఐ మాట్లాడుతూ నెల్లిపట్ల గ్రామంలో జరిగిన ఘటనపై విచారించామన్నారు. దాడులకు పాల్పడిన ఇరు పార్టీ ఏజెంట్లు, వారి వర్గీయులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

క్రికెట్ తెచ్చిన తంటా!

రెండు గ్రామాల యువకుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: క్రికెట్ ఆట తెచ్చిన తంటా రెండు గ్రామాల యువకుల మధ్య గొడవ కారణమైంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. పుల్లూరు ఎస్సీ కాలనీ యువకులు రెండు వారాల క్రితం ఆడిన క్రికెట్ ఆట సందర్భంగా మనస్పర్థలు వచ్చాయి. పుల్లూరికి చెందిన ఒక యువకుడిని ఎస్సీ కాలనీ యువకులు కొడతామని బెదిరించడంతో అతను గ్రామంలోని మరి కొంతమంది యువకులకి విషయం చెప్పాడు. పుల్లూరు యువకులు వెళ్లి కాలనీ యువకులను ఎందుకు కొడతారని అడగడంతో ఎస్సీ కాలనీకి చెందిన 15మంది పుల్లూరు యువకులను ఆదివారం సాయంత్రం కొట్టారు. దీంతో వారు చేసేది లేక వెనుతిరిగారు. పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని ఊరుకున్నారు. సోమవారం పుల్లూరు బస్‌స్టాప్ వద్ద కాలనీలోని కొందరు పెద్దలను పుల్లూరువాసులు పిలిపించి మాట్లాడారు. గంటల తరబడి దాడి చేసిన వారిని పెద్దమనుషుల దగ్గరకు రానివ్వకుండా పరారీలో ఉంచడంతో సహనం నశించి పుల్లూరు గ్రామంలోని యువకులు దాడి చేసిన వారి ఇళ్లకు వెళ్లి కిటికీ బైకు పైపులను పగలగొట్టారని స్థానికులు తెలిపారు.

నాయకుల జోక్యం..

పుల్లూరు యువకుల మధ్య జరిగిన ఘర్షణపై రాజకీయ నాయకులు జోక్యం చేసుకున్నారు. వైసీపీ నుంచి డిప్యూటీ సీఎం స్పందిస్తూ దళితులపై దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఆ గ్రామానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. కాగా గొడవలు లేకుండా అనవసరంగా తప్పు చేసిన వారు ఎవరైనా చర్యలు తీసుకోవాల్సిందేనని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ డిమాండ్ చేశారు. ఘటన దారుణమని వెనువెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

ఫ్లస్సా.. మైనస్సా..?

- పోలింగ్ సరళిపై అభ్యర్థుల లెక్కలు
- బూత్‌ల వారీగా పరిస్థితిపై అంచనా
- మరోవైపు ఫలితాలపై అభ్యర్థుల ఉత్కంఠ



ప్రజాశక్తి - డక్కిలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఆదివారం ముగిసింది. జూన్ 4వ తేదీ ఫలితాలు వెలువడనున్నాయి. పోలింగ్ ముగిసిన సాయంత్రం నుంచి ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు గెలుపోట ములపై బేరీజు వేసుకుంటున్నారు. 'పలానా పోలింగ్ బూత్‌లో మనకి ఎన్ని ఓట్లు వస్తాయి? అవతల ప్రధాన పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉంది.. మిగతా పార్టీలకు వచ్చే ఓట్ల పరిస్థితి ఏమిటి. అక్కడ మనకు ఫ్లస్సా.. మైనస్సా...' అంటూ లెక్కలు వేస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గ అభ్యర్థులు ఎన్నికల సంగ్రా మం నుంచి సేదతీరి, మరో పక్క ఇంటికి వచ్చే నాయకుల నుంచి వారి ప్రాంతంలో పోలింగ్ సరళిని అడిగి తెలుసుకుంటున్నారు. మున్సిపాలిటీ, మండలం, వార్డులు, గ్రామాలు ఇలా అన్ని స్థాయిలో పోలింగ్ బూత్‌ల వారీగా క్షేత్ర స్థాయిలో 'మన పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి? ఇతర పార్టీలకు ఎన్ని ఓట్లు వచ్చే అవకాశం ఉంది .. మన పార్టీ పరిస్థితి బాగుందా లేదా?' అంటూ ఆరా తీస్తూ లెక్కల్లో మునిగి తేలుతున్నారు.

మహిళా ఓటర్లే అధికం...

వెంకటగిరి నియోజకవర్గంలో మొత్తం 2,43,582 ఓటర్లు ఉండగా ఆదివారం జరిగిన పోలింగ్ లో 1,96,986 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 97,799 కాగా 99,184 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వారిలో ఉన్నారు. ఈ లెక్కన మహిళా ఓటర్లే అభ్యర్థుల గెలుపు ఓటమిలకు కీలకం కానున్నారు. 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి 1,09,204 (57.26 శాతం)ఓట్లు సాధించగా,ప్రత్యర్థి టిడిపికి చెందిన కురుమండ్ల రామకృష్ణ కు 70,484 (36.96 శాతం) ఓట్లు మాత్రమే వచ్చాయి. ఆ ఎన్నికల్లో అప్పటి వైసిపి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి 38,720 ఓట్లు ఆధిక్యంతో గెలుపొందారు. ఈ సారి ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా నేదురు మల్లి రామ్ కుమార్ రెడ్డి, టిడిపి అభ్యర్థిగా కురుగొండ్ల రామకృష్ణతో పాటు ఇండియా కూటమి అభ్యర్థిగా పంట శ్రీనివాసులు రెడ్డిలతో పాటు మరో ఏడు గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈసారి ఫలితాలు ఎలా ఉంటాయో ప్రజలు ఎవరికి పట్టం కట్టి శాసనసభలో అధ్యక్షా...?' అనే అవకాశం ఎవరికి ఇస్తారో వేచి చూడాల్సిందే. జూన్ 4న రిజల్ట్ డే కోసం నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.